నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: సమ్మర్ యాక్షన్ ప్లాన్ నిమిత్తం ఆర్ఎన్ఎస్ ఫీడర్ పరిధిలో శనివారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వినయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాయినగర్, ఆర్ఎన్ఎస్ కాలనీ, రాయల్ మెడోస్, ఆర్ఎన్ఎస్ డ్రీమ్ హోమ్స్, అమ్మసాని వెంకట్‌రెడ్డి కాలనీ, పద్మావతి కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే దేవేందర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, గౌతమినగర్, రాజీవ్‌నగర్, జ్యోతినగర్, వీరారెడ్డినగర్, ఇందిరానగర్ కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కుషాయిగూడ: చర్లపల్లి–1 సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం నాగారం ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని రెడ్డికాలనీ, భగవాన్‌కాలనీ, కట్టింగ్ కాలనీ, హైటెన్షన్ లేన్, చక్రిపురం, న్యూ గాంధీనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1:30 నుంచి 3 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

గౌతంనగర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్ 11కేవీ షఫీనగర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రామిక్‌నగర్, నెహ్రూనగర్, గణేష్‌నగర్, భరత్‌నగర్, షఫీనగర్, మోగుల్‌కాలనీ, లక్ష్మీనగర్, సుధానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వసంతపురి సబ్‌స్టేషన్ పరిధిలో..

వసంతపురి కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ గీతభవానీ, 11కేవీ రాజానగరం ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వెంకటేశ్వరనగర్, పటేల్‌నగర్, చింతలబస్తీ, హైదర్‌నగర్, బండల కంపెనీ, మిర్జాలగూడ, సెయింట్ ఆన్స్ స్కూల్, అదేవిధంగా 11కేవీ రాఘవేంద్ర ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు నర్సింహారెడ్డినగర్, బాలసరస్వతి నగర్, మారుతినగర్, ఓల్డ్ మల్కాజిగిరి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి



జలమండలి ఎండీతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి పనులకు నిధుల కేటాయించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ విషయంపై శుక్రవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ వ్యవస్థ, వాటర్ వర్క్స్ వంటి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు బైరి నవీన్‌గౌడ్, నేమూరి మహేష్‌గౌడ్, గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయ హుండీ లెక్కింపు



ఉప్పల్: ఉప్పల్ మహంకాళి అమ్మవారి ఆలయాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధీనంలోకి తీసుకున్న తర్వాతే మొదటిసారి అమ్మవారి హుండీ లెక్కింపు ప్రక్రియ ప్రారంభించారు. ఈవో వీరేశం, ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ.లక్షా ఐదువేల వరకు వచ్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా చైర్మన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర గుప్తా, అనిల్‌కుమార్ గుప్తా, మీనంపల్లి అండాలు తదితరులు పాల్గొన్నారు.

రక్తం పీలుస్తున్న దోమలు

సాయంత్రం అయ్యిందంటే స్వైరవిహారం

- ఎక్కడికక్కడే పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- మొక్కుబడిగా ఫాగింగ్ చేస్తున్న ఎంటమాలజీ
- అధికారుల నిర్లక్ష్యంతోనే వృద్ధి
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



కాప్రా: కాప్రా సర్కిల్ పరిధిలో దోమల స్వైర విహారం విపరీతంగా పెరిగిపోయింది. ప్రజలపై దండయాత్ర చేస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రధానంగా కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి డివిజన్లలోని పలు కాలనీల వాసులు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం అయ్యిందంటే చాలు ఆరు బయట నిలబడేందుకు జంకుతున్నారు. రాత్రి వేళలో జాగారం చేయాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయకపోవడం, నాలాల్లో దోమలు వృద్ధి చెందకుండా దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందాయి.

మొక్కుబడిగా ఫాగింగ్...

కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి డివిజన్లలోని పలు కాలనీల్లో నుంచి ఓపెన్ నాలా పారుతుండటంతో దోమల బెడద విపరీతంగా ఉండి ప్రజలను అనారోగ్యానికి గురి చేస్తున్నాయి. అప్పుడప్పుడు ఎంటమాలజీ సిబ్బంది ఫాగింగ్ చేస్తున్నా అది మొక్కుబడిగానే సాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో అధికారులు ప్రచార ఆర్భాటాలకే పరిమితం అవుతున్నారు తప్ప క్షేత్రస్థాయిలో చాలా ప్రాంతాల్లో కుప్పలుగా చెత్త పేరుకుపోతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో దోమల నివారణకు చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



నాచారం చెరువులో గుర్రెపు డెక్క తొలగిస్తూ..

తిరిగి యాక్షన్ ప్లాన్ మొదలు పెట్టాం..



"దోమల నివారణకు అన్ని డివిజన్లలో తిరిగి యాక్షన్ ప్లాన్ మొదలు పెట్టాం. నెల రోజుల పాటు నాచారం చెరువుపై దృష్టి పెట్టడంతో సిబ్బంది మొత్తం అక్కడే విధులు నిర్వహించాల్సి వచ్చింది. ప్రస్తుతం చెరువులో గుర్రెపు డెక్క తొలగింపు పనులు పూర్తి కావడంతో యధావిధిగా అన్ని డివిజన్లలో నివారణ చర్యలపై దృష్టి సారించాం. ఫిబ్రవరి, మార్చి నెలలో దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుంది. అందుకు తగ్గట్లుగా నివారణ చర్యలు చేపట్టాం. ముందుగా చెరువులు, నాలాలపై దృష్టి పెట్టి, అనంతరం ఇతర నివారణ చర్యలు చేపడుతున్నాం. ఇకపై యధావిధిగా కాలనీల్లో ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం." - రమేష్, ఎంటమాలజీ ఏఈ

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

బోడుప్పల్: చిన్నతనం నుంచి విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు ఆగిన తర్వాతే ఎక్కడం, దిగడం చేయాలన్నారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్ పోలీసులను గౌరవించాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు ఫోన్ మాట్లాడొద్దని ఇంటికి వెళ్లిన తర్వాత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించాలన్నారు.



ప్రమాణం చేస్తున్న విద్యార్థులు

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలంటూ విద్యార్థులచే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య టెక్నో స్కూల్ సీజ్

మౌలాలి: విద్యాశాఖ గుర్తింపు లేకుండా నడుస్తున్న మల్కాజిగిరి మండలం సాయినాథ్‌పురంలోని శ్రీచైతన్య టెక్నో పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్, టీఎస్ఎస్ఎఫ్ సంఘాల నాయకులు ధర్మేంద్ర, శివానంద్, సత్యప్రసాద్, హరి, శ్రీను తదితరులు డిమాండ్ చేశారు. గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని నాయకులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ మేరకు 2025–26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు చేస్తూ, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని మండల విద్యాధికారి సురేష్‌కు నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవని, అడ్మిషన్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఎంఈఓ వివరణ ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో పిల్లలను చేర్పించొద్దని ఆయన సూచించారు. ఇప్పటికి 12మంది అడ్మిషన్లు తీసుకున్నట్లు విచారణలో తేలిందన్నారు. పాఠశాలను సీజ్ చేశామని, ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఎంఈఓ తెలిపారు.



స్కూల్‌కు తాళం వేస్తున్న ఎంఈఓ

రూ.3.50 కోట్లతో అభివృద్ధి పనులు

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ పరిధిలోని శేషసాయినగర్, మల్లికార్జుననగర్ కాలనీ మీదుగా ఉప్పల్ నల్ల చెరువుకు వెళ్తున్న నాలాతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, స్థానికుల అభ్యర్థన మేరకు నాలాకు రిటర్నింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. అందుకు రూ.1.95 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంజూరు పత్రాన్ని శుక్రవారం కాలనీవాసులకు అందజేశారు. భారీ వర్షాలు కురిసినప్పుడు కాలనీలను వరద ముంచెత్తుతోందని, సమస్య పరిష్కారం కోసం ప్రణాళికలు పంపినట్లు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే నిధులు మంజూరు చేశారన్నారు. దీంతో పాటు రూ.1.55 కోట్లతో శేషసాయినగర్, మల్లికార్జుననగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, స్థానికులు సత్తిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భీమా నాయక్, అంబటి ప్రభాకర్, సురేష్, ఆనంద్, సల్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలుకానగర్ అభివృద్ధికి రూ.6 కోట్లు



మేయర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి స్టాండింగ్ కమిటీలో రూ.6 కోట్ల నిధులను మంజూరు చేసినందుకు శుక్రవారం జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని చాంబర్‌లో చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చిలుకానగర్ చౌరస్తా నుంచి కావేరినగర్ కల్వర్టు వరకు, వరద నీటి పైప్‌లైన్‌ను వేయనున్నట్లు తెలిపారు. ఈదారి గుంతలమయం కావడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రజా అవసరాలు దృష్టిలో ఉంచుకుని రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు.

సామాజిక అంశాలు అధ్యయనం చేయాలి



మాట్లాడుతున్న భారత మాజీ రాయబారి సురేష్ బాబు

కాప్రా: యువత సామాజిక అంశాలను అధ్యయనం చేసి దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని భారత మాజీ రాయబారి సురేష్ బాబు పిలుపునిచ్చారు. ఈసీఐఎల్‌లోని నీలం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన కె.ఎల్.మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్‌ను శనివారం ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యూపీఎస్సీ పరీక్షల్లో అర్హత సాధించి అనేక మెళకువలు తెలుసుకున్నట్లు చెప్పారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు సామాజిక అంశాలను నిశితంగా అధ్యయనం చేయాలన్నారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం ముఖ్యంకాదని, ఆ ఉద్యోగాలు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుకోవాలన్నారు. వ్యక్తిగత కాంక్షను పక్కనపెట్టి దేశమే ముఖ్యమనే నానుడితో యువత ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్ బోస్, కె.ఎల్.మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ కార్యదర్శి దామోదర్‌రెడ్డి, సభ్యులు శంకర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా బొంతు శ్రీదేవి



కుషాయిగూడ: జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ సతీమణి బొంతు శ్రీదేవి ఎన్నికయ్యారు. డివిజన్ సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ తనదైన శైలిలో ముందుకు దూసుకెళ్తున్న ఆమెకు స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా అవకాశం రావడం అభినందనీయం అని చర్లపల్లి డివిజన్ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేటర్‌గా డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్నానని అన్నారు. కాంగ్రెస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

మత్తుతో జీవితాలు చిత్తు

అల్వాల్: విద్యార్థులు మత్తుకు అలవాటు కాకుండా ఉండాలని నార్కోటిక్ డ్రగ్స్ డీఎస్పీ భిక్షపతి, ఇన్‌స్పెక్టర్ సామ్యునాయక్ అన్నారు. రాచకొండ పరిధిలోని ఓల్డ్ నేరేడ్‌మెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నార్కోటిక్ డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై విద్యార్థులకు నార్కోటిక్ డ్రగ్స్ టీమ్, నేరేడ్‌మెట్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుతో జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. మంచి అలవాట్లు అలవర్చుకొని సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని చెప్పారు. కార్యక్రమంలో నేరేడ్‌మెట్ ఎస్ఐ రమేష్, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ గాయిత్రితో పాటు సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నార్కోటిక్ డ్రగ్స్ డీఎస్పీ భిక్షపతి

మత్తుతో బంగారు భవిష్యత్తు చిత్తు

గౌతంనగర్: తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీజీఎన్ఏబీ), మల్కాజిగిరి పోలీసులతో కలిసి శుక్రవారం మల్కాజిగిరిలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలో మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీజీఎన్ఏబీ ఏసీపీ రమేష్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ రవాణా, వినియోగాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్, ఎస్ఐలు, మల్కాజిగిరి పోలీసులు, స్కూల్స్ హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి ప్రభుత్వ పాఠశాలలో..

మాతృభాషతో విస్తృత అవకాశాలు

ఉప్పల్: మాతృభాషతో ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని కేంద్రీయ విద్యాలయ తెలుగు సహాయ ఆచార్యులు డా.పి.విజయ్ కుమార్ అన్నారు. ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాతృభాషా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. బోధన, పత్రికలు, ప్రసార రంగం, సృజనరంగం, అనువాదం, ప్రచార సంబంధాలు, ప్రభుత్వ పాలన, వ్యాపార దౌత్యం, పర్యాటక రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో విశ్వనాథ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.రవిప్రసాద్, డా.సీహెచ్ సత్యనారాయణ, డా.ఎస్.రాజశ్రీ, డా.యమున, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



విజయ్ కుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల బృందం

వదంతులు నమ్మొద్దు.. చికెన్ తినండి

- వరంగల్ జాతీయ రహదారిపై ఫుడ్ ఫెస్టివల్



ఉప్పల్: ఉప్పల్‌లో శ్రీసాయి డీఎంఆర్ బాయిలర్ మార్కెట్ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ జాతీయ రహదారిపై ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. చికెన్–65, బాయిల్డ్ ఎగ్‌లను నిర్వాహకులు డి.మల్లారెడ్డి, సంజీవరెడ్డి ఉచితంగా పంపిణీ చేశారు. చికెన్, గుడ్లపై ఉన్న అపోహలను తొలగించేందుకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించామన్నారు. అనేక మంది వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వదంతులను నమ్మకుండా చికెన్, గుడ్లను తినాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంఘ సేవకులు ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో జాప్యం వద్దు

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: రానున్న వేసవి కాలం దృష్ట్యా మల్కాజిగిరి నియోజకవర్గం ప్రజలకు తాగునీటి సరఫరాలో జాప్యం లేకుండా, తగిన సమయంలో నీటిని విడుదల చేసేందుకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరేడ్‌మెట్ సీటీఎస్ కాలనీలో ఏడేళ్ల నుంచి పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథా అవుతోందని, వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. కౌకూర్ జనప్రియ ఆర్కేడ్ అపార్టుమెంట్‌లో నామ మాత్రంగా 4 నెలలు నీటి సరఫరా చేసి సాంకేతిక కారణాలు చెబుతూ నీటి సరఫరా నిలిపివేశారని, వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. మచ్చబొల్లారం డివిజన్ ఏడు జేజేసీ కాలనీల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం కౌకూర్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో నీటి అక్రమ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్న జలమండలి అధికారిని మందలించారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జలమండలి జీఎం సునీల్, డీజీఎంలు సాంబయ్య, ఆశ్రిత రాజు, మేనేజర్లు నవీన్, మల్లికార్జున్, తేజస్విని, కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సునీతయాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్‌గౌడ్, నర్సింగ్‌రావు, నాయకులు పరమేష్, రాముయాదవ్, లక్ష్మణ్‌యాదవ్, యాదగిరిగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో వేసవికాలంలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతరామయాదవ్ అన్నారు. జలమండలి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్పొరేటర్ సునీత ఆధ్వర్యంలో గౌతంనగర్ డివిజన్ పరిధిలోని నీటి సరఫరా, నీటి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం సునీల్, డీజీఎం ఆశ్రిత, మేనేజర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.



గౌతంనగర్ డివిజన్ సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత, అధికారులు

కులగణన సర్వేకు సహకరించాలి



రామంతాపూర్: రెండో విడత కులగణన సర్వేలో గణనకు వచ్చేవారికి సహకరిస్తూ ప్రతి ఒక్కరూ సర్వేలో పాల్గొనాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లో ఉప్పల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కులగణన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కులగణన సర్వే పూర్తి స్థాయి నివేదిక వచ్చిన అనంతరం రిజర్వేషన్లు ఖరారు చేసి స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మేడ్చల్ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఝాన్సీరాణి, జీహెచ్ఎంసీ ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, వివిధ కుల సంఘాల నేతలు కనకయ్య ముదిరాజ్, మురళీకృష్ణ ముదిరాజ్, శ్రీనివాస్ చారి, యాదయ్య పటేల్, రఘుపటేల్, రాజన్న, బాలయ్య, పాషా తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను మరవొద్దు



అల్వాల్: మల్కాజిగిరి డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు అధ్యక్షత వహించగా తెలంగాణ సారస్వత పరిషత్తులో తెలుగు సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ గజవెల్లి ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇతర భాషలు నేర్చుకున్నా మాతృభాషను మర్చిపోవద్దని తెలిపారు. సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తప్పనిసరిగా మాతృభాషలో మాట్లాడతామని అందరూ ప్రతిజ్ఞ చేయాలన్నారు. తెలుగు విభాగం అధిపతి పి.శైలజ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవి రాజు, బి.శోభన్‌బాబు, డాక్టర్ జగన్, డాక్టర్ రాశేష్‌కుమార్, డాక్టర్, అహల్య, డాక్టర్ స్వాతి, డాక్టర్ వెంకట్‌రెడ్డి, తిరుమలేశ్, మీనయ్య, వెంకటరెడ్డి, వినోద్ పాల్గొన్నారు.